ఘనంగా అంకుట్ పూజలు



అంకుట్ పూజలను నిర్వహిస్తున్న పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్

జియాగూడ: జియాగూడలోని సమర్ధనారాయణ ఆశ్రమంలో అంకుట పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆశ్రమంలోని వివిధ దేవతామూర్తులకు అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ, గోమాత మహోత్సవం, సంకీర్తన గోపూజ, గోసేవా, సుందర కాండ తులసిమానస, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు ఆలయ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. చివరగా మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు

చార్మినార్: పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలు రానున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకుంటూ భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ఏకాదశి రోజు శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాదికొకసారి వచ్చే వైకుంఠ ఏకాదశి నాడు స్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తారు. భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉత్సవాల నిర్వాహకులు వారం రోజుల ముందు నుంచే తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈసారి జరిగే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి పల్లకి ఊరేగింపు తదితర కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్యాచరణను రూపొందించారు.

ఈ నెల 23న...

ఈ నెల 23న నిర్వహించే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాతబస్తీలోని పలు వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంతో పాటు ఫూల్ బాగ్, యాకుత్‌పురా–బ్రహ్మణవాడి, వట్టేపల్లి, ఫతేదర్వాజ, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల్లోని వెంకటేశ్వర స్వామి దేవాలయాలు వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే కొన్ని దేవాలయాల అర్చకులు దేవాలయాల విశిష్టతను భక్తులకు తెలియచేసే విధంగా కరపత్రాల ద్వారా స్థానిక భక్తులకు సమాచారాన్ని అందజేస్తున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యవర్గ సమావేశాలను నిర్వహించి ఇప్పటికే కార్యాచరణ రూపొందించుకున్నారు.



చార్మినార్‌లో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి

కనుల పండువగా పల్లకి ఊరేగింపు..



చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 23న ఉదయం వైకుంఠ ద్వార దర్శనం అనంతరం ఆరున్నర గంటలకు దేవాలయం నుంచి స్వామి వారి పల్లకి సేవ ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించనున్నాం. చార్మినార్, గుల్జార్‌హౌజ్, కాలీకమాన్, పంజేషా, ఎతేబార్‌చౌక్, కోట్లా ఆలిజా ద్వారా తిరిగి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకుంటుంది. అలాగే 26వ తేదీన నమ్మళ్వార్ పరమపద మహోత్సవం కొనసాగుతుంది.

– శృంగారం ఆత్రేయాచార్యులు, అంకార బ్రహ్మ, ఆలయ అర్చకులు

కాంగ్రెస్ పార్టీ హామీలు కచ్చితంగా అమలు చేస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ ఖుస్రో పాషా బియబానీ

నాంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఖుస్రో పాషా బియబానీ అన్నారు. నాంపల్లి గాంధీభవన్ గ్రంథాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ అధ్యక్షతన జష్నే– ఏ–తెలంగాణ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సయ్యద్ ఖుస్రో పాషా బియబానీ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన మైనార్టీలందరికి సముచితమైన స్థానం లభిస్తుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె. అఫ్జలుద్దీన్, ఉజ్మా షాకీరా, మహ్మద్ రయీస్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతిక విద్యకు జీఎన్‌ఐటీఎస్ మారుపేరు



సెమినార్‌లో పాల్గొన్న వారు

గోల్కొండ: అధునాతన సాంకేతిక విద్యకు జీఎన్‌ఐటీఎస్ మారుపేరుగా నిలిచిందని షేక్ పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవ రెడ్డి అన్నారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ఆయన ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సాంకేతిక సెమినార్‌లకు తమ కళాశాల వేదికగా ఉందని అన్నారు. అంతర్జాతీయ సెమినార్ నిర్వాహకులు తమ కళాశాలను వేదికగా ఎంచుకోవడం తమ కళాశాల ప్రత్యేకతను తెలుపుతుందని అన్నారు.

గ్రేటర్‌లోనే ఆదర్శ నియోజకవర్గంగా గోషామహల్



ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సత్కరిస్తున్న బ్రిజ్‌రాజ్ సింగ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రాజా సింగ్ పేర్కొన్నారు. మూడవసారి తనను గెలిపించిన గోషామహల్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఆదివారం ధూల్‌పేట్‌కు చెందిన బ్రిజ్‌రాజ్‌సింగ్ రాజాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత పదేళ్లల్లో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందించేందుకు తన కార్యాలయం ఎప్పుడు తెరిచే ఉంట్టుందన్నారు.

18న స్పీకర్‌కు పురస్కారం ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఈ నెల 18వ తేదీన రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మత సామరస్యానికి మారుపేరు గోల్కొండ



గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న అక్బర్, సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ ప్రజలు శాంతికాముకులను ఈ ప్రాంత మనసామరస్యానికి మరోపేరుగా నిలిచిందని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గోల్కొండ మైత్రి అండ్ పీస్ కమిటి సభ్యులు ఆయనను సన్మానించారు. గోల్కొండ బోనాలు, అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించిన గోల్కొండ పోలీసులకు ఈ సందర్భంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గోల్కొండలో హిందూ, ముస్లిం సోదరులు కలిసి మెలిసి ఉంటారని అన్నారు. నగరంలోనే ఇక్కడ మతసామరస్యం ఒక ప్రత్యేకత అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి బోనాల నిర్వహణకు సహకరించిన సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పూలమాలలు వేసి సన్మానించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



శ్రీకాంత్‌చారికి బహుమతి అందిస్తున్న అంజుమ్‌బాబుఖాన్

గోల్కొండ: ఉత్తమ సేవలకు గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని గ్లెండల్ అకాడమీ ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండర్ అంజుమ్ బాబుఖాన్ అన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమె అడ్మిన్ విభాగం ఉద్యోగి బొమ్మల శ్రీకాంత్‌చారికి ఉత్తమ సర్వీస్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో క్రమ శిక్షణతో పని చేస్తూ తోటి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపిన ఉద్యోగిగా శ్రీకాంత్‌చారికి మంచి పేరు ఉందని అన్నారు.

మంత్రి కొండా సురేఖకు అభినందనలు



మంత్రి కొండా సురేఖకు ఆశీర్వచనలు ఇస్తున్న అర్చక ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని దేవాలయ శాఖ అర్చక ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షులు కాండూరి కృష్ణమాచార్యులు కోరారు. నూతనంగా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖను జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆమెను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేవాదాయ ధర్మాదాయ శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో పెండింగ్ ఉన్న సమస్యలను దశల వారిగా పూర్తి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం ఆమె రూ.4 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొంపల్లి భరద్వాజ్, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పారా రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ చూపిన నగరవాసి



గెలుపొందిన పథకాలతో శ్రీధర్ రాయల తదితరులు

విజయనగర్‌కాలనీ: ఈ నెల 11 నుంచి 17 వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన 1వ ఖేలో ఇండియా పారా గేమ్స్ 2023లో నగరానికి చెందిన సత్య జనర్ధాన శ్రీధర్ రాయల ప్రతిభ కనబరిచారు. పారా రైఫిల్ షూటింగ్ విభాగం ఆర్–4 లో రజతం, ఆర్–5లో కాంస్య పతకాలను గెలిచారు. రాబోయే పారాషూటింగ్ వరల్డ్ కప్ 2024లో కూడా ఎంపికైనట్లు, ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత సత్తా చాటి దేశానికి పేరు తీసుకువస్తానన్నారు.

అయోధ్య రామ మందిర సైకిల్ యాత్ర ప్రారంభం



అయోధ్య రామ మందిర సైకిల్ యాత్రలో పాల్గొన్న భక్తులు

డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడి శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప సేవా సమితి సన్నిధానం ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిర సైకిల్ యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కార్పొరేటర్లు

బహదూర్‌పురా: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఫుడ్ ఫెస్టివల్స్ ఎంతగానో దోహదపడుతాయని కార్పొరేటర్లు ఖాదర్, హుస్సేనీ పాషాలు పేర్కొన్నారు. కాలాపత్తర్‌లోని గోల్డెన్ జూబ్లీ హై స్కూల్‌లో జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు డ్రై ఫ్రూట్స్ వివిధ వంటకాలను ఎంతో చక్కగా చేసి చూపించారు. పాఠశాల డైరెక్టర్ హైదర్ రాజా, ప్రిన్సిపాల్ అబ్బాస్ రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోషామహాల్ అభివృద్ధికి కృషి



మాజీ మంత్రి తలసానిని కలిసిన ప్రదీప్‌రాజ్

అబిడ్స్: గోషామహాల్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహాల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రాజ్ తలసానికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కారం చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.... గత పదేళ్లల్లో గోషామహాల్‌లో కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేశానన్నారు. గోషామహాల్ ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ ప్రగతి, అభివృద్ధిని అందించేందుకు తాను ముందుంటానన్నారు.

సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవం



సీనియర్ సిటిజన్స్ సంక్షేమ నూతన సభ్యులు

రాజేంద్రనగర్: భవానీనగర్ సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్, రంగారెడ్డి అసోసియేషన్‌కి సంబంధించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మధుసూదన్ రావు, జిల్లా అధ్యక్షులు పి.ప్రతాప్ రెడ్డి, సత్తయ్య గౌడ్, ఎం.అమృత రెడ్డి, ఎం.సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ మండల సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కె.నర్సింహ గౌడ్, ఉపాధ్యక్షులుగా డి.రమేశ్, జాయింట్ సెక్రటరీగా వి.వెంకటేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గయాసూర్ రహమాన్, ప్రధాన కార్యదర్శిగా ఎ. అమర్ సింగ్, కోశాధికారిగా పి.మోహన్ రావు, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా కె. రామారావు, పి. జీవన్ దాస్, డి. గాంధీ, కె. నర్సింహ, భాషా, లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వేము వందనం బి.పరమేశ్వర్, సలహదారులుగా ఎ. సత్యనారాయణ రెడ్డి, సి. బాల్‌రాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, వయోవృద్ధుల కష్టాలు, నివారణ మార్గాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో గోల్కొండ కిటకిట..



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు అధికసంఖ్యలో వచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కోటకు వచ్చారు. భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ బుకింగ్ కౌంటర్ వద్ద భారీ క్యూ ఏర్పడింది. గోల్కొండ ఎంట్రెన్స్ గేట్ వద్ద చెకింగ్ పాయింట్ వద్ద భారీగా మహిళలు బారులు తీరారు. కోటలోని నగీనాబాగ్‌లో గల సైనికుల గదులను పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కోటలోని రాణిమహల్, అక్కన్నమాదన్న కార్యాలయం చూడడానికి పర్యాటకులు క్యూ కట్టవలసి వచ్చింది. రాణిమహల్ ప్రాంగణంలో గల ఫౌంటెన్ అందాలను చూస్తే పలువురు పర్యాటకులు ఆశ్చర్యపోయారు. పిల్లలు, పెద్దలు, కోట పై భాగంలో మెట్ల వద్ద సందడి చేస్తూ సెల్ఫీలు దిగారు. కాగా భారీ సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట ముందు ఉన్న రెస్టారెంట్లు అన్ని కిటకిటలాడాయి. పలు హోటళ్లల్లో బిర్యానీతో పాటు టీ, సమోసాలు హాట్ కేక్‌లుగా అమ్ముడుపోయాయి.

22 నుంచి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాసర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: డిసెంబర్ 22వ తేదీ నుంచి మల్లేపల్లిలో దివంగత సయ్యద్ యూసుఫ్ అలీ పహిల్వాన్ జ్ఞాపకార్థం రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నాసర్, కులకి తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో రెజ్లింగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 22 నుంచి 24 వరకు మల్లేపల్లి పనిగ్రౌండ్‌లో కుస్తీపోటీలు జరుగుతాయని యూసుఫ్ అలీ కేసరి టైటిల్ 75 కేజీల నుంచి 100 కేజీల విభాగంలో గెలుపొందినవారికి మెడల్, ట్రాక్‌షాట్ అందివ్వనున్నట్లు తెలిపారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

నేడు హెచ్‌సీయూలో నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్టూడెంట్స్ యూనియన్ 2023–24 ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలుపుతున్నట్లు అధ్యక్షుడు ఎండీ అతీఖ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడు డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల హెచ్‌సీయూలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారని, వారి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేసే వరకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తామన్నారు.

ఉత్సాహంగా లమ్‌హే వేడుకలు

శంషాబాద్: ఐసీఎంబీ బిజినెస్‌స్కూల్ విద్యార్థుల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే వేడుకలు ఆదివారం సాయంత్రం పట్టణంలోని తనిష్క్ కన్వెన్షన్‌లో ఉత్సాహంగా జరిగాయి. అత్తాపూర్ ఐసీఎంబీ బిజినెస్ స్కూల్ విద్యార్థులు లమ్‌హే–23 పేరిట నిర్వహించిన ఈ వేడుకల్లో సినీనటి శ్రవంతి పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఫ్యాషన్‌షో, క్యాట్ వాక్, నృత్యాలు చేసి ఔరా అనిపించారు.

నూతన అసోసియేషన్ ఏర్పాటు

రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్‌లో ఆదివారం బన్సీలాల్‌నగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కొత్త కమిటీ ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా పి.మోహన్, ఉపాధ్యక్షులుగా దేవేందర్ వర్మ, జనరల్ సెక్రటరీగా సాయి మల్లిక్, కోశాధికారిగా రవి కుమార్, జాయింట్ సెక్రటరీగా సి.యాదయ్య, భ్కార్, ఆర్గనైజింగ్ సభ్యులుగా చంద్రశేఖర్, ఆశ్వక్, సతీష్, వికాస్, దినేశ్, రాహుల్, సలహదారులుగా సి.నాగరాజు, డి.రాజు, నాగమ్మ, కృష్ణ కుమార్, ఎన్నికయ్యారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



చార్మినార్: మీరాలం మండి మహాంకాళేశ్వర దేవాలయం ప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవాన్ని సోమవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉదయం ముందుగా సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం, అర్చన నిర్వహించిన అనంతరం కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నా మన్నారు.

బహిరంగంగా దమ్ము కొడుతున్నా.. కట్టడి చేయరేం..

- ధూమపాన నిషేధం అమలుపై లేని శ్రద్ధ..
- బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా సిగరెట్ల వాడకం..
- ప్రచారం నిర్వహించి కట్టడి చేయాలంటున్న పాతబస్తీ ప్రజలు



చార్మినార్: బస్టాప్‌లు..రైల్వేస్టేషన్.. ఆసుపత్రులు... దుకాణాలు... ఇలా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇష్టానుసారంగా పొగ తాగుతూ తోటి వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న పోగరాయుళ్లను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు. చార్మినార్ కట్టడం, చౌ మహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూ పార్కు వంటి సందర్శనీయ ప్రదేశాలలో సైతం బహిరంగ ధూమపానం చేస్తూ సందర్శకులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. పొగరాయుళ్ల ఆగడాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించాలని సందర్శకులతో పాటు పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై చెత్త వేయవద్దు... బహిరంగ ప్రదేశాల్లో మూత్రం చేయవద్దు...అని జీహెచ్‌యంసీ చెబుతున్నట్లుగానే... బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించిన విషయాన్ని కూడా ప్రచారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగే వారిపై నిఘా పెట్టి అడ్డుకుని నియంత్రించే కార్యక్రమాలు చేప్పాట్టాల్సిన అవసరం ఉందంటున్నారు. రహదారులు ఇలా ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా దమ్ము కొడుతుండడంతో వారి పక్కనుండే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కింది స్థాయి సిబ్బందితో పాటు అధికారులు సైతం దమ్ము కొట్టడానికి వెనుకాడడం లేదు. కొంత మంది అధికారులు తమ ఛాంబర్ లోనే స్మోకింగ్ చేస్తూ... ఫైళ్లను పరిశీలిస్తున్నారు..ఇది ఎంత మాత్రం సరైంది కాదు.

నగం కాలిన సిగరెట్లతో పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు....

కొందరు పొగరాయుళ్లు ఎక్కడ పడితే అక్కడ సిగరెట్లను తాగుతూ పక్కన వేస్తుండడంతో అప్పుడప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తాగి...సగం కాలిన సిగరెట్లను రోడ్ల పక్కన పడేస్తుంటారు. ఇలా పడేసిన సిగరెట్లతోనే ఒక్కోసారి అనుకోని విధంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చెత్తా చెదారాలు ఉన్న ప్రాంతంలో కాలుతున్న సిగరెట్‌ను పడేయడంతో మంటలంటుకున్నాయి. గతంలో మొఘ ల్‌పురా వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చెత్తలో కాలిపోయింది. అక్కడ ఉన్న చెత్తలో ఎవరో గుర్తుతెలియని స్మోకర్ సిగరెట్ తాగి వేయడంతో ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తేల్చారు. చెత్త అంటుకుని పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఇలా బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ తాగుతూ.. పక్కవారికి ఇబ్బందులు కలిగించడమే కాకుండా అప్పుడప్పుడు అక్కడక్కడ ప్రమాదాలకు కూడా కారణమవుతున్నారు. పాతబస్తీలో స్మోకర్లను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.